అల్లర్లను అణచివేస్తాం

అల్లర్లు, దాడులపై ఉక్కుపాదం మోపుతామంటున్నారు పోలీసులు. తమవద్ద ఉన్న సామగ్రితో సంఘ విద్రోహ చర్యలను ఎలా అణచి వేస్తామో ప్రత్యక్షంగా చేసి చూపించారు. మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజల్లో ధైర్యం కల్పించారు. పోలీస్ శక్తిని చంద్రగిరిలో ప్రదర్శించారు. అల్లరిమూకల గుండెల్లో దడ పుట్టించారు. - చంద్రగిరి

- ఎటువంటి దాడులు జరిగినా ఎదుర్కోవడానికి సిద్ధంగా పోలీసు శాఖ
- తమ సిబ్బందితో శాంతి భద్రతలకు విఘాతం కల్పించేవారిపై లాఠీచార్జ్, భాష్పవాయు ప్రయోగం, కాల్పులతో మాక్‌డ్రిల్ నిర్వహించిన పోలీసులు
- విషయం తెలియక నిజంగా పోలీసులు లాఠీచార్జ్ చేస్తున్నారేమోనని భయాందోళనకు గురైన ప్రజలు
- చివరకు మాక్‌డ్రిల్ అని తెలియడంతో నివ్వెరపోయిన వైనం
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు: అడిషనల్ ఎస్పీ కులశేఖర్
- కౌంటింగ్ పూర్తయ్యే వరకు సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ 30 అమలు
- జిల్లా వ్యాప్తంగా లూజు పెట్రోల్, డీజిల్, బాణసంచా విక్రయాలు నిషేధం





మాక్‌డ్రిల్‌లో భాగంగా ఆందోళనకారులను అదుపు చేస్తున్న పోలీసులు, లాఠీచార్జ్‌తో చెల్లాచెదురు చేస్తున్న ప్రత్యేక దళాలు, గాయాలపాలైన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్తున్న ప్రత్యేక దళాలు

సమయం సాయంత్రం 4 గంటలు. ఒక్కొక్క వాహనంలో భారీగా పోలీసులు చంద్రగిరి టవర్‌క్లాక్ వద్దకు చేరుకున్నారు. 4.30 గంటలకు ఏఆర్, సివిల్, ప్రత్యేక సాయుధ దళాలు చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద మోహరించాయి. అంతలోనే కొంత మంది నిరసనకారులు ప్లకార్డులు చేతబట్టుకుని పాతపేట నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తూ వస్తున్నారు. ఇంతలో చంద్రగిరి సీఐ రామయ్య తన సిబ్బందితో నిరసనకారులను నిలువరించేందుకు అక్కడకు చేరుకున్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎటువంటి ర్యాలీలు, నిరసనలకు అనుమతులు లేవని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నిరసనకారులు మాత్రం పోలీసుల మాటలను ఖాతరు చేయకుండా ఒక్కసారిగా వారిపై రాళ్లు రువ్వుతూ ఆ ప్రాంతంలో భయానక వాతావరణాన్ని సృష్టించారు. పరిస్థితిని సీఐ రామయ్య ఉన్నతాధికారులకు చేరవేడయంతో, అదనపు బలగాలు చంద్రగిరికి చేరుకున్నాయి. అనంతరం రంగంలోకి దిగిన ప్రత్యేక బలగాలు, సాయుధ దళాలు నిరసనకారులపై లాఠీచార్జ్ చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో భాష్ప వాయువును సైతం ప్రయోగించారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో నిరసనకారులపై పోలీసులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ఓ వ్యక్తికి బుల్లెట్ తగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో హుటాహుటిన 108 వాహనంలో తిరుపతికి తరలించారు. ఇదంతా చూసిన జనం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. చంద్రగిరిలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి. కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ప్రజలను చైతన్య పరచడంతోపాటు భారీగా పోలీసులు, ప్రత్యేక సాయుధ దళాలు తమ పరిధిలో ఉన్నాయని, ఇదంతా ప్రజలకు తెలియజేసేందుకు చేసిన మాక్‌డ్రిల్ అని పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించడంతో అక్కడి జనాలు ఊపిరి పీల్చుకున్నారు. ఇదంతా నిజమేమో అనుకుని భయపడిపోయామంటూ అక్కడి ప్రజలు మాట్లాడుకున్నారు.

పోలీస్ శక్తి ప్రదర్శన

జూన్ 4వ తేదిన కౌంటింగ్ నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ కులశేఖర్ నేతృత్వంలో శనివారం సాయంత్రం స్థానిక టవర్‌క్లాక్ వద్ద పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇటీవల పోలింగ్ ముగిసిన తర్వాత నియోజకవర్గంలో జరిగిన హింసాత్మక ఘటనల దృష్ట్యా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్ కుమార్ 144 సెక్షన్‌ను అమలులోకి తీసుకొచ్చారు. ఈ క్రమంలో శనివారం నిర్వహించిన మాక్‌డ్రిల్ ద్వారా కౌంటింగ్ రోజున, ఆ తర్వాత ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా తీసుకుంటున్న చర్యలపై ప్రజలకు అవగాహన కోసం ఈ మాక్ డ్రిల్‌ను నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ కులశేఖర్

శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, అల్లరి మూకలు విధ్వంసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ కులశేఖర్ స్పష్టం చేశారు. శాంతి భద్రతల సమస్య ఉత్పన్నమైనప్పుడు అల్లరి మూకలను ఏ విధంగా అదుపు చేస్తూ, చెదరగొట్టాలో తెలియజేస్తూ చంద్రగిరిలో మాక్ డ్రిల్‌ను నిర్వహించామన్నారు. కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉందని, అలాగే 144 సెక్షన్, పోలీసు యాక్టు 30 కూడా అమలులో ఉంటాయన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి హింసాత్మక చర్యలకు పాల్పడితే వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో జిల్లా ప్రజలకు తెలియజేసేందుకు మాక్ డ్రిల్ చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా ఎన్నికలకు సంబంధించిన రౌడీషీటర్లను అవసరమైన మేరకు బైండోవర్, హౌస్ అరెస్టులు చేశామన్నారు. ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా నాకా బందీలు, కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు, ఫ్లాగ్‌మార్చ్ వంటి కార్యక్రమాలు చేస్తూ అసాంఘిక శక్తులకు దడ పుట్టిస్తున్నట్లు తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతులు లేవని, జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో లూజు పెట్రోల్, డీజిల్ విక్రయాలు, బాణసంచాల విక్రయాలు జరపకూడదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య, డీఎస్పీలు శరత్ రాజ్‌కుమార్, రవీంద్రారెడ్డి, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ప్రత్యేక సాయుధ బలగాలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రుయాలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు



చిన్నపిల్లల విభాగంలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభిస్తున్న అధికారులు

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆసుపత్రిలోని చిన్నపిల్లల విభాగంలో ఆర్‌ఓ ప్లాంట్‌ను తిరుపతి పీపుల్స్ చారిటీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ మేరకు రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు , చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్‌లకు ఆ సంస్థ ప్రతినిధులు శనివారం రూ.1.50 లక్షల విలువగల ఆర్‌ఓ ప్లాంట్‌ను అందజేశారు. రుయాకు వచ్చే పేద రోగులు, వారి సహాయకుల కోసం అవసరమైన వసతులు, సదుపాయాలు కల్పించేందుకు దాతలు ముందుకు రావాలని సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఆర్‌ఎంఓ డాక్టర్ హరికృష్ణ, ప్రొఫెసర్లు డాక్టర్ అంజన్ కుమార్, పర్ఫ్యూషన్ టెక్నీషియన్ చిరంజీవి పాల్గొన్నారు.

డీవైఈఓ పరీక్షలు ప్రశాంతం

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నేతృత్వంలో నిర్వహించిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. 66 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ మేరకు వారికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. 840 మంది అభ్యర్థులకు గాను 554 మంది పరీక్షలకు హాజరయ్యారు. జిల్లాలో 11 సెంటర్లలో పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు.

దివ్యాంగులకు భరోసా... భవిత కేంద్రాలు



సర్వేను పరిశీలిస్తున్న ఐఈ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి

రామచంద్రాపురం: భవిత కేంద్రాలు దివ్యాంగులకు భరోసాగా నిలిచాయని ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆర్సీపురం ఎస్టీకాలనీ, కమ్మకండ్రిగ గ్రామాల్లో ఐఈఆర్టీలు నిర్వహిస్తున్న సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పిస్తున్నట్లు తెలిపారు. భవిత కేంద్రాలలో దివ్యాంగులకు విద్యాబుద్ధులు నేర్పించి ఫిజియోథెరపీ చేయడంతోపాటు వారికి అవసరమైన పరికరాలను అందిస్తున్నట్లు చెప్పారు. బడికి వచ్చే విద్యార్థులకు 10 నెలల పాటు రీడర్ అలవెన్సు రూ.200, ఆడపిల్లలకు గర్ల్ చైల్డ్ అలవెన్స్ రూ.300, హోం బేస్డ్ అలవెన్సు రూ.200, రవాణా అలవెన్సు రూ.300 ప్రభుత్వం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, షూ, టై అందించడంతోపాటు అమ్మ ఒడి పథకానికి వీరు అర్హులని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్టీలు రాజేశ్వరి, మనోహర్ పాల్గొన్నారు.

దేవదేవం భజే.. దివ్య ప్రభావం..



సంకీర్తనలను గానం చేస్తున్న సుధారాణి


తిరుపతి కల్చరల్: దేవదేవం భజే.. దివ్య ప్రభావం.. అంటూవిశాఖపట్నంకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసురాలు మండ సుధారాణి బృందం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనాలాపన వీనులవిందుగా సాగింది. అన్నమయ్య జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో సుధారాణి బృందం సంగీత కచేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు శ్రీమన్నారాయణ....., ఆనంద సాగరం మీద నీ దేహం, దేవ దేవం భజే దివ్యప్రభావం తదితర అన్నమయ్య సంకీర్తనలను సుమధురంగా గానం చేసి భక్తుల హృదయాలను తన్మయత్వంలో ఓలలాడించారు. దీనికి ముందు ఉదయం 9 గంటలకు తిరుపతి చంద్రశేఖర్ హరికథా గానం రంజింపజేసింది. డాక్టర్ విభీషణ శర్మ, బాలిరెడ్డి, కోకిల పాల్గొన్నారు.

వరప్రసాద్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ ఆర్థిక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి కసిరెడ్డి వరప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.దేవరాజులు పర్యవేక్షణలో ఫైనాన్సింగ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాక్టీస్ ప్రాబ్లమ్స్ అండ్ ఇన్నోవేట్ స్ట్రాటజీస్ అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు

హర్షవర్ధన్‌రెడ్డికి...



తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇంజినీరింగ్ ఈసీఈ విభాగం పరిశోధక విద్యార్థి కె.హర్షవర్ధన్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ డి.గౌరీశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అనాలసిస్ ఆఫ్ మోడీఫైడ్ వాటర్ ఇండిసెస్ ఫర్ సర్ఫేస్ వాటర్ డిటెక్షన్ ఇన్ ల్యాండ్ శాట్-8 ఇమేజరీ అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు.

కందులవారిపల్లిలో టీడీపీ నాయకుల ఆరాచకం

- పాల సెంటర్ ప్రభుత్వ భవనాన్ని కూల్చేసిన వైనం
- ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించిన టీడీపీ నాయకుడు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన రెవెన్యూ అధికారులు



కూల్చేసిన ప్రభుత్వ భూమిలోని పాలసేకరణ కేంద్ర భవనం

చంద్రగిరి: ప్రభుత్వ భూమిలో నిర్మించిన భవనాన్ని ఎలాగైనా కబ్జా చేసి స్వాధీనం చేసుకునేందుకు టీడీపీ నాయకులు పన్నాగం పన్నారు. అవకాశం కోసం ఎదురు చూశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఇటీవల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు పక్కా స్కెచ్‌తో అందులోని భవనాన్ని నేలమట్టం చేసిన ఘటన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సొంత పంచాయతీ కందులవారిపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు.. కందులవారిపల్లి లెక్కదాఖల సర్వే నంబరు 100లో 2 సెంట్లకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిలో 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వం పాల సేకరణ కోసం భవనాన్ని నిర్మించారు. అనంతరం కొన్నాళ్ల పాటు ఆ భవనంలో రేషన్ బియ్యం పంపిణీ సైతం చేపట్టారు. కొన్నాళ్ల పాటు గ్రామంలోని పలువురికి పునరావాస కేంద్రంగా ఉపయోగించుకునే వారు. ఈ క్రమంలో గత పదేళ్లుగా భవనం నిరుపయోగంగా మారింది. దీంతో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కొండుపాటి కేశవులునాయుడు భవనానికి ఆనుకుని ఉన్న పొలాన్ని కొనుగోలు చేయడంతో, భవనాన్ని కూల్చేసి ఆక్రమించుకుంటే సరిహద్దులు ఏర్పాటు చేసుకోవచ్చునని భావించాడు. నాలుగేళ్లుగా ఎలాగైనా ఖరీదైన స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నిస్తూ వచ్చాడు. గతంలో పాలసెంటర్ భవనం అంగన్‌వాడీ కేంద్రానికి ఇవ్వాలంటూ దళితులు సైతం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో టీడీపీ నాయకుడు తన ఇద్దరు కుమారులతో కలసి ఈ నెల 20వ తేదీన జేసీబీ సాయంతో భవనాన్ని కూల్చివేసినట్లు స్థానిక ప్రజలు చెబుతున్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని కూల్చేసిన భవనాన్ని పరిశీలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

న్యాయశాఖలో ఉండి ఇదేం పాడుబుద్ధి

ప్రభుత్వ భవనాన్ని కూల్చేసి కబ్జాకు యత్నించిన టీడీపీ నాయకుడి కుమారుల్లో ఒకరు తిరుపతి న్యాయశాఖలో విధులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఇదేం పాడుబుద్ధి అంటూ జనం దుమ్మెత్తిపోస్తున్నారు. తండ్రితో కలసి ప్రత్యక్షంగా భవనాన్ని జేసీబీ సాయంతో కూల్చివేయడంతో పాటు భవన శిథిలాల్లోని ఇనుప కడ్డీలను సైతం విక్రయించేయడంపై విమర్శలకు తావిస్తోంది.

మెరుగైన పారిశుధ్య నిర్వహణే లక్ష్యం



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అదితి సింగ్

తిరుపతి తుడా: నగరంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ అన్నారు. అధికారులతో కలిసి కమిషనర్ శనివారం నగరంలో పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి పనుల తీరుపై ఆకస్మిక తనిఖీ చేశారు. తెల్లవారుజామున నుండి నగరంలో లీలా మహల్ కూడలి, ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్, బాలాజీ కాలనీ, బేరి వీధి, కర్నాల వీధి, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఆటోనగర్ సమీపంలోని గొల్లవాని గుంట బండ్ అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టనున్నట్లు చెప్పారు. మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం నిలవకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించేలా అదేశాలు ఇచ్చామన్నారు. ప్రతిరోజూ ఇంటి వద్దకే చెత్త సేకరణకు కార్మికులు వస్తున్న చాలా మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చెత్తను రోడ్లపై పారబోస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చెత్తను సిబ్బందికి మాత్రమే ప్రజలు అందించాలని సూచించారు. దుకాణాల వద్ద ఎక్కడైనా పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. రోడ్లపై, కాలువల్లో చెత్త వేసే వారిని గుర్తించి జరిమానా విధించేలా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌కి సూచించారు. మార్కెట్‌లో ఎక్కడపడితే అక్కడ చెత్త ఉండరాదని, సంబంధిత దుకాణదారులే బాధ్యత వహించాలన్నారు. ఇంజినీరింగ్, పారిశుధ్య సిబ్బంది ఒక అవగాహనతో పనిచేసి కాలువల్లో చెత్త నిల్వ లేకుండా శుభ్రం చేయాలని తెలిపారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య, సుమతి, మేస్త్రీలు తదితరులు ఉన్నారు. అనంతరం ఆటోనగర్ సమీపంలోని గొల్లవానిగుంటలో ఉన్న క్రికెట్ స్టేడియం, ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. స్టేడియంలో ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే బండ్ పైన ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఫౌంటెయిన్ పనులు పూర్తి చేయాలని అన్నారు. నడక కోసం వచ్చే వారు కొంతసేపు కూర్చునేందుకు వీలుగా అక్కడక్కడా బెంచీలు ఏర్పాటు ఏర్పాటు చేయాలని తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏఈకాం ప్రతినిధి బాలాజీ, అనిల్, కాంట్రాక్టర్ సంతోష్ తదితరులు ఉన్నారు.

తిరుమలలో టీటీడీ విస్తృత ఏర్పాట్లు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ నేపథ్యంలో టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్న ప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలతోపాటు భక్తులు అధికంగా ఉండే ప్రాంతాలలో ఆహారం, పాలు, తాగు నీరు అందించేలా చర్యలు చేపట్టింది. శ్రీవారి సేవకులు అన్నప్రసాదం, ఆరోగ్య, విజిలెన్స్ విభాగాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని కీలక ప్రదేశాల్లో సేవలందిస్తున్నారు. ఇందులో భాగంగా శిలాతోరణం, బాట గంగమ్మగుడి, మార్గాలలో శ్రీవారి దర్శనం కోసం క్యూలైన్లలో ఉన్న భక్తుల సౌకర్యార్థం 27 ప్రాంతాల్లో తాగునీరు, 4 ప్రాంతల్లో అన్నప్రసాదాలు అందిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆక్టోపస్ భవనం నుంచి శిలాతోరణం వరకు ప్రత్యేకంగా 8 బస్సులు ఏర్పాటు చేసి ప్రతి నిమిషానికి భక్తులను చేరవేసేలా చర్యలు తీసుకున్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలోనే మధ్యాహ్నానికి దాదాపు 60 వేల మందికి పైగా అన్న ప్రసాదం అందించగా, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూలైన్లలో 50 వేల మందికి అన్నప్రసాదాలు (ఇందులో ఉప్మా, పొంగల్ ఉన్నాయి) పంపిణీ చేశారు. సాధారణం కంటే రెట్టింపుగా అన్న ప్రసాదాలు అందించారు. అంతేకాకుండా పిల్లలకు పాలు అందిస్తున్నారు. క్యూలైన్లలో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా టీటీడీ విజిలెన్స్, పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకు 46,486 మంది యాత్రికులు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు. భక్తుల అధిక రద్దీ కారణంగా జూన్ 30వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఆదేశాల మేరకు ఇంజినీరింగ్, ఆరోగ్యం, అన్నప్రసాదం, విజిలెన్స్, వైద్య శాఖల ఉన్నతాధికారులు భక్తుల సౌకర్యాలను, క్యూలైన్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

రేపటి నుంచి కల్యాణ వెంకన్న వసంతోత్సవాలు

- మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాలు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి వార్షిక వసంతోత్సవాలు సోమవారం నుండి 29వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 8.30 గంటలకు ఉత్సవర్లు ఆలయం నుండి వసంత మండపానికి వేంచేపు చేస్తారు. తొలి రెండు రోజులు శ్రీవారు ఉభయనాంచారులతో కలిసి వసంతోత్సవంలో పాల్గొంటారు. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి, సీతాలక్ష్మణ హనుమంత సమేత శ్రీరామచంద్రమూర్తి, రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివార్ల ఉత్సవమూర్తులను వసంత మండపానికి వేంచేపుగా తీసుకొచ్చి వేదపండితులు శాస్త్రోక్తంగా ఆస్థానం నిర్వహించనున్నారు. వసంత రుతువులో లభించే పుష్పాలు, ఫలాలను సమర్పించి స్వామివారి దివ్యానుగ్రహం పొందడమే ఈ వసంతోత్సవం అంతరార్థం. రెండో రోజు మే 28వ తేదీ సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు స్వర్ణ రథోత్సవం కనులపండువగా నిర్వహించనున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు ఊంజల్‌సేవ, రాత్రి 7 నుండి 8 గంటల వరకు వీధి ఉత్సవం నిర్వహిస్తారు. గృహస్తులు(ఇద్దరు) ఒక రోజుకు రూ.516 చెల్లించి ఈ వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేయనున్నారు.

ఆర్జిత సేవలు రద్దు

వసంతోత్సవాల సందర్భంగా సోమవారం నుండి 29వ తేదీ వరకు కల్యాణోత్సవం, మే 28న స్వర్ణ పుష్పార్చన, మే 29న అష్టోత్తర శత కలశాభిషేకం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో హరికథలు, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బంగారు తిరుచ్చిపై శ్రీనివాసుడు



బంగారు తిరుచ్చిపై భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఆలయ ఏఈఓ గోపినాథ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్‌పై మార్గదర్శకాలు



పోలీసుల నిఘా నీడలో శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌పై ఆర్వోలు, ఏఆర్‌ఓలు, ఎన్నికల డీటీలు, కౌంటింగ్ సిబ్బందికి ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసింది. ముఖ్యంగా స్ట్రాంగ్ రూమ్ లేఅవుట్‌పై ఇన్‌చార్జ్ అధికారి అవగాహన కలిగి ఉండాలని, నోడల్ అధికారులు వారికి అప్పగించిన పనులు సక్రమంగా నిర్వర్తించాలని, సందేహాలు వచ్చినప్పుడు ఆర్వోలతో ఎప్పటికప్పుడు మాట్లాడాలని, అంతేతప్ప సొంత నిర్ణయాలు తీసుకుంటే చర్యలకు గురవుతారని హెచ్చరించింది. పోస్టల్ బ్యాలెట్, స్ట్రాంగ్ రూమ్ నోడల్ అధికారులు, సీలింగ్ అధికారులు, రో-ఇన్‌చార్జ్‌లు అనుసరించాల్సిన విధి విధానాలను ప్రత్యేకంగా సూచించింది. పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్లు ఎలా లెక్కించాలి, వ్యాలిడ్, ఇనావ్యాలిడ్ ఓట్లను ఎలా గుర్తించాలి అనేదానిపై కౌంటింగ్ సిబ్బందికి త్వరలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించింది. అలాగే ఓట్ల లెక్కింపు రోజున అధికారులు వారికి కేటాయించిన విధులకు సంబంధించి చెక్‌లిస్ట్ ప్రకారం ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్నికల సంఘం పేర్కొంది. రౌండ్ల వారీగా ఫలితాల నమోదు, వాటిని ప్రకటించే క్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కౌంటింగ్ పూర్తయి తుది ఫలితాలు ప్రకటన విడుదల చేయగానే గెలుపొందిన అభ్యర్థికి ఫారం 21-ఈని అందజేయాలని పేర్కొంది.

స్ట్రాంగ్ రూమ్‌ల ఆకస్మిక తనిఖీ



స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భద్రతపై స్వయంగా సమీక్షించారు. సీసీ కెమెరా కంట్రోల్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతతో పాటు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

కౌటిల్య విద్యార్థులకు ఐఐఎం అడ్మిషన్లు



ఐఐఎంలలో సీట్లు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి ఎమ్మార్ పల్లి సర్కిల్‌లోని కౌటిల్య విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు క్యాట్ తుది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి దేశంలోని ప్రముఖ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)లో అడ్మిషన్లు పొందారు. ఆ విద్యాసంస్థలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆ సంస్థ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ తమ విద్యార్థులు 8 మంది ప్రముఖ ఐఐఎంలలో, అలాగే మరో 10 మందికి పైగా విద్యార్థులు దేశంలోనే టాప్ బిజినెస్ స్కూల్స్‌లో ఎంబీఏ అడ్మిషన్లు సాధించినట్లు తెలిపారు. ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు సియాద్రి, కేవీఎస్ జ్యేష్ఠ లేఖ్య ఏకంగా 15 ఐఐఎం సంస్థల్లో అడ్మిషన్లకు అర్హత సాధించారని తెలిపారు. అంబటి సురేందర్‌రెడ్డి, సి.ధర్మేష్, భవ్యశ్రీ నిశిత, ఎం.గౌరీశంకర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్, ఎస్.అనుదీప్ యాదవ్‌ల అడ్మిషన్లు పొందారని తెలిపారు. క్యాట్, ఐఐఎంలో అడ్మిషన్లకు సంబంధించి ఉచిత గైడెన్స్‌కు తమను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.